సాక్షి

అల్లూరి సీతారామరాజు జిల్లా

ఆదివారం । 29 । అక్టోబర్ । 2023



బాధ్యతగా పనిచేయండి

ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ బాధ్యతగా పనిచేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. 8లో



మురిసిన పర్యాటకం

జిల్లాలోని ప్రముఖ పర్యాటక ప్రాంతాల్లో సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో భారీగా తరలివచ్చారు. 8లో



వరి కోతల సందడి

డుంబ్రిగుడ మండలంలో వరి కోతలు ఊపందుకున్నాయి. మహిళలు ఉత్సాహంగా వ్యవసాయ పనుల్లో పాల్గొన్నారు.

న్యూస్‌రీల్

బస్సు యాత్ర విజయవంతం చేయండి

- గ్రామాల్లో వైఎస్సార్‌సీపీ నేతల విస్తృత ప్రచారం



ప్రచారం చేస్తున్న ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, జెడ్పీటీసీ వెంకటలక్ష్మి

సాక్షి,పాడేరు: ఈనెల 30వ తేదీన పాడేరులో జరగనున్న సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేయాలని కోరుతూ వైఎస్సార్‌సీపీ నేతలు విస్తృత ప్రచారం చేస్తున్నారు. బస్సుయాత్ర ఇన్‌చార్జి, ఎమ్మెల్సీ లేళ్ల అప్పిరెడ్డి ఆదేశాల మేరకు గ్రామగ్రామాన పార్టీ శ్రేణులు ప్రచారం నిర్వహిస్తున్నారు. ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి అన్ని మండలాల నేతలతో సమన్వయం చేసుకుంటూ బస్సు యాత్ర ఏర్పాట్లలో నిమగ్నమయ్యారు. రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, పార్టీ ఎస్టీసెల్ రాష్ట్ర అధ్యక్షురాలు, జి.మాడుగుల జెడ్పీటీసీ డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, ఎస్టీసెల్ జోనల్ ఇన్‌చార్జి కిముడు విశ్వ, పార్టీ నేతలు కూడా సింహచలం, కోడా సుశీల శనివారం వంతాడపల్లి, గుత్తులపుట్టు, జి.ముంచంగిపుట్టు, దోకులూరు, ఇరడాపల్లి పంచాయతీల పరిధిలో ప్రచారం నిర్వహించారు.

ఘాట్‌రోడ్డులో టిప్పర్ బోల్తా



బోల్తా పడిన టిప్పర్

గూడెంకొత్తవీధి: మైదాన ప్రాంతం నుంచి సీడిగొంది రహదారికి చిప్స్ తీసుకువెళ్తున్న టిప్పర్ శనివారం సాగుల ఘాట్‌రోడ్డులో బోల్తాపడింది. ఈ ఘటనలో డ్రైవర్, క్లీనర్ సురక్షితంగా బయటపడ్డారు.

పరారైన గంజాయి నిందితుడు పట్టివేత



గంజాయి నిందితుడితో పోలీసులు

ముంచంగిపుట్టు: పరారీలో ఉన్న గంజాయి నిందితుడిని రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ రవీంద్ర తెలిపారు. మండలంలోని బుంగాపుట్టు పంచాయతీ బొర్రమామిడి గ్రామానికి చెందిన గొల్లోరి లోకాష్ గంజాయి కేసులో నిందితుడు. వాహనంలో తరలిస్తున్న 30 కిలోల గంజాయిని లబ్బూరు సమీపంలో గతంలో పోలీసులు పట్టుకున్నారు. ఈ కేసుతో సంబంధం ఉన్న లోకాష్ అప్పటినుంచి పరారీలో ఉన్నాడు. శనివారం అతనిని అదుపులోకి తీసుకుని రిమాండ్‌కు తరలించామని ఎస్‌ఐ పేర్కొన్నారు.

మత్స్యగెడ్డలో జారి పడి వ్యక్తి మృతి

- నాలుగు రోజుల తరువాత మృతదేహం లభ్యం



గొల్లోరి గురు (ఫైల్)

పెదబయలు: మత్స్యగెడ్డలో గల్లంతైన వ్యక్తి మృతదేహం నాలుగు రోజుల తరువాత లభ్యమైంది. మండలంలోని అరడకోట పంచాయతీ పురుగుడిపుట్టు గ్రామానికి చెందిన గొల్లోరి గురు(59) ఈనెల 25వ తేదీ ఉదయం పొలంలో పనికి వెళ్లాడు. ప్రమాదవశాత్తూ కాలు జారి మత్స్యగెడ్డలో పడి గల్లంతయ్యాడు. అప్పటినుంచి కుటుంబ సభ్యులు గాలించినా జాడ కనిపించలేదు.శనివారం ఉదయం గ్రామ సమీపంలోని మత్స్యగెడ్డలో గురు మృతదేహం లభ్యమైంది. మృతదేహాన్ని బయటకు తీసి పోస్టుమార్టంకు తరలించి కేసు నమోదు చేశామని ఎస్‌ఐ పులి మనోజ్‌కుమార్ తెలిపారు. మృతుడికి భార్య, నలుగురు సంతానం ఉన్నారు.

కిడ్నీ రోగులకు సత్వర వైద్యం

చింతూరు ప్రభుత్వ ఆస్పత్రిలో ఏర్పాటుచేసిన డయాలసిస్ సెంటర్ కిడ్నీ వ్యాధిగ్రస్తులకు బాసటగా నిలుస్తోంది. ఇప్పటివరకు 134 మంది వ్యాధి బారిన పడగా 2020 నుంచి నేటివరకు 65 మంది ప్రాణాలకు కోల్పోయినట్టుగా అధికారిక లెక్కలు చెబుతున్నాయి. వ్యాధి తీవ్రతను గుర్తించిన ప్రభుత్వం డయాలసిస్ సెంటర్‌ను అందుబాటులోకి తెచ్చి నిరంతరాయంగా సేవలందిస్తోంది.

- చింతూరు ప్రభుత్వాస్పత్రిలో బాసటగా డయాలసిస్ సేవలు
- 2020 నుంచి అందుబాటులోకి తెచ్చిన ప్రభుత్వం
- అధునాతన వైద్యంతో వ్యాధిగ్రస్తులకు ఊరట

చింతూరు: స్థానిక ఏరియా ఆస్పత్రిలో కిడ్నీ రోగులకు సత్వర వైద్యసేవలు అందుతున్నాయి. ఇక్కడ 2020లో ఏర్పాటుచేసిన డయాలసిస్ కేంద్రం రోగులకు బాసటగా నిలుస్తోంది. ఈ కేంద్రంలో 2020–21లో 567 సార్లు, 2021–22లో 3,176 సార్లు, 2022–23లో 3,762 సార్లు డయాలసిస్ చేశారు. ఈ ఏడాది ఇప్పటివరకు 3,736 సార్లు డయాలసిస్ చేసినట్టు వైద్యాధికారులు తెలిపారు.

చెడు వ్యసనాలే కారణం

డివిజన్ పరిధిలో మండలాలు పూర్తిగా ఏజెన్సీ ప్రాంతం కావడంతో గిరిజనులు తమకు అవసరమైన నిత్యావసర సరకుల కొనుగోలుకు వారపు సంతలపై ఆధారపడతారు. స్థానిక వ్యాపారులతో పాటు ఛత్తీస్‌గఢ్, తెలంగాణ, ఒడిశాకు చెందిన వ్యాపారులు నిత్యావసర సరకులను తెచ్చి విక్రయిస్తుంటారు. వీటిలో నాణ్యతలేనివి ఎక్కువగా ఉన్నందున ఇవి ఆరోగ్యంపై ప్రభావం చూపిస్తున్నాయని వైద్యులు చెబుతున్నారు.

మండలం	రోగుల సంఖ్య
ఎటపాక	43
చింతూరు	30
కూనవరం	25
వీఆర్‌పురం	18

- వ్యాపారులు విక్రయించే కారం, పసుపు, సబ్బులు, వంట నూనెల్లో అధిక శాతం నకిలీలు ఉంటున్నాయి. వీటిని గిరిజనులు కొనుగోలు చేసి వినియోగిస్తున్నారు.



చింతూరు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ సేవలు పొందుతున్న కిడ్నీ వ్యాధిగ్రస్తులు

- సంప్రదాయంలో భాగంగా గిరిజనుల్లో అధిక శాతం మందికి పొగాకు నమిలే అలవాటు ఉంటుంది. దీనిని అవకాశంగా తీసుకుని ఒడిశా, ఛత్తీస్‌గఢ్‌కు చెందిన వ్యాపారులు పొగాకుతో పాటు ప్రాణాంతకమైన సున్నాన్ని విక్రయిస్తున్నారు. పొగాకు, సున్నం కలిపి నమలడం వల్ల కిడ్నీలు దెబ్బతినే అవకాశముందని ఆయన తెలిపారు.
- అమోనియా, కుళ్లిన అరటిపండ్లతో తయారు చేసిన సారా సేవించడం వల్ల కిడ్నీలు దెబ్బతింటాయని డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో డాక్టర్ పుల్లయ్య తెలిపారు.
- ప్రభుత్వాస్పత్రుల్లో పూర్తిస్థాయిలో వైద్య వసతులు ఉన్నాయి. అవగాహన లోపం, మూఢ నమ్మకాలతో ఎక్కువశాతం గిరిజనులు నాటువైద్యాన్ని ఆశ్రయించి ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. వీరు వినియోగించే పసర మందులు కూడా కిడ్నీలపై చూపుతుందని వైద్యులు చెబుతున్నారు.

13 ఆర్‌ఎంపీ క్లినిక్‌ల సీజ్

ఆర్‌ఎంపీలు తమ స్థాయికి మించి వైద్యం చేస్తున్నారన్న విమర్శలు వస్తున్న నేపథ్యంలో వైద్య ఆరోగ్యశాఖ అధికారులు స్పందించారు. ఇటీవల వీఆర్‌పురం, ఎటపాక మండలాల్లో తనిఖీలు నిర్వహించారు. 13 ఆర్‌ఎంపీ క్లినిక్‌లను సీజ్ చేశారు.

సీఎం చొరవతో..

కిడ్నీ రోగుల కోసం చింతూరు ఏరియా ఆసుపత్రిలో ఏర్పాటుచేసిన డయాలసిస్ కేంద్రం ఎంతో ఉపయోగకరంగా మారింది. నాలుగు మండలాల్లో గతంలో కాళ్లవాపు, కిడ్నీ వ్యాధితో అనేకమంది మృత్యువాత పడ్డారు. ఈ విషయాన్ని సీరియస్‌గా తీసుకున్న ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అప్పటి వైద్యశాఖ మంత్రి ఆళ్ల నానిని హుటాహుటిన చింతూరు పంపించారు. మృతుల కుటుంబాలకు రూ.5 లక్షల చొప్పున పరిహారం అందించారు. ఇందుకు గల కారణాలు తెలుసుకుని నివారణ చర్యలు చేపట్టాలని ఆయన ఆదేశించారు. దీంతో మంత్రి ఈ ప్రాంతంలో పర్యటించి చింతూరు ఏరియా ఆస్పత్రిలో డయాలసిస్ కేంద్రం ఏర్పాటుకు చర్యలు తీసుకున్నారు.

- 2020 అక్టోబరులో అపోలో డయాలసిస్ ఆధ్వర్యంలో అధునాతనంగా ఏర్పాటు చేసిన ఈ కేంద్రం ద్వారా అనేకమంది కిడ్నీ రోగులు డయాలసిస్ సేవలు పొందుతున్నారు. ఈ కేంద్రం లేనప్పుడు డయాలసిస్ కోసం కాకినాడ, రాజమహేంద్రవరం, రంపచోడవరం, భద్రాచలం వంటి దూర ప్రాంతాలకు వెళ్లాల్సి వచ్చేది. చింతూరు ఏరియా ఆస్పత్రిలో ఏర్పాటుతో రోగులకు అవస్థలు తప్పాయి. దీంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం డయాలసిస్ రోగులకు ప్రతినెలా రూ.10 వేల చొప్పున పింఛను అందజేస్తోంది.

అవగాహన కల్పిస్తున్నాం



డివిజన్లో కిడ్నీ వ్యాధిగ్రస్తుల సంఖ్యతో పాటు డయాలసిస్ సంఖ్య క్రమేపీ పెరుగుతోంది. నిపుణులైన వైద్యులు సైతం అత్యవసర సమయాల్లో మాత్రమే వినియోగించే స్టెరాయిడ్లు, షెడ్యూల్ హెచ్ మందులు, పెయిన్ కిల్లర్ మాత్రలను రోగులకు ఆర్‌ఎంపీలు ఇస్తున్నారు.

రోగులను పరీక్షించి సాధారణ మాత్రలు మాత్రమే ఇవ్వాలి. సెలైన్లు ఎక్కించకూడదు. పెయిన్ కిల్లర్లు, షెడ్యూల్ హెచ్ మాత్రలు, స్టెరాయిడ్లు ఇవ్వకూడదు. దీనిపై ఆర్‌ఎంపీలకు సమావేశాలు ఏర్పాటు చేసి అవగాహన కల్పిస్తున్నాం.

– డాక్టర్ పుల్లయ్య, డిప్యూటీ డీఎంఅండ్‌హెచ్‌వో, చింతూరు

ఘనంగా వాల్మీకి జయంతి



మాట్లాడుతున్న ఐటీడీఏ పీవో అభిషేక్

పాడేరు రూరల్ : వాల్మీకి మహర్షి సాహిత్యంలో పేరొందిన గొప్ప కవి అని పాడేరు ఐటీడీఏ పీవో వి. అభిషేక్ అన్నారు. పాడేరు సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థ కార్యాలయంలో శనివారం ఆయన జయంతిని నిర్వహించారు. చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు ప్రభాకర్‌రావు, వెంకటేశ్వరరావు, ఏవో హేమలత, సిబ్బంది పాల్గొన్నారు.

బర్రిమామిడిలో విగ్రహావిష్కరణ



బర్రిమామిడిలో వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి

గంగవరం : వాల్మీకి మహర్షి రచించిన రామాయణ గ్రంథం ద్వారా రాముడు దేవుడని ప్రపంచానికి తెలిసిందని రంపచోడవరం ఎమ్మెల్యే నాగులపల్లి ధనలక్ష్మి అన్నారు. శనివారం బర్రిమామిడి గ్రామంలో వాల్మీకి సంఘం ఆధ్వర్యంలో ఏర్పాటుచేసి వాల్మీకి మహర్షి విగ్రహాన్ని ఆమె ఆవిష్కరించి, పూలమాలలు వేసి నివాళులర్పించారు. వాల్మీకి సంఘ జిల్లా అధ్యక్షుడు గొర్లె చిన నారాయణ, జెడ్పీటీసీ బేబీరత్నం, ఎంపీపీ పల్లాల కృష్ణారెడ్డి , సంఘ మండల అధ్యక్షుడు గొర్లె రాజుబాబు, ఉప సర్పంచ్ మోహన్, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

ఆంధ్ర వైద్య కళాశాలకు శతాబ్ది వైభవం

- ఉపరాష్ట్రపతి రాకతో సందడి వాతావరణం
- విశాఖ, ఏఎంసీపై ఉపరాష్ట్రపతి ప్రశంసల జల్లు
- ఏఎంసీ నుంచి బీచ్‌రోడ్డు వరకు వైద్యుల కోలాహలం
- ఐఎన్ఎస్ డేగాలో జగదీప్ ధన్కర్‌కు స్వాగతం, వీడ్కోలు



పైలాన్ ఆవిష్కరిస్తున్న ఉపరాష్ట్రపతి ధన్కర్, గవర్నర్ నజీర్, మంత్రులు విడదల రజని, అమర్‌నాథ్

మహారాణిపేట/గోపాలపట్నం: ఆంధ్రా వైద్య కళాశాల(ఏఎంసీ) శతాబ్ది ఉత్సవాల సందడితో నగరం మురిసింది. భారత ఉపరాష్ట్రపతి, గవర్నర్ రాకతో ఏఎంసీ వందేళ్ల సంరంభానికి మరింత శోభ చేకూరింది. వైద్య కళాశాల నుంచి బీచ్‌రోడ్డులోని ఏయూ కన్వెన్షన్ హాలు వరకూ ఎటు చూసినా వైద్యుల కోలాహలం కనిపించింది. మొత్తంగా ఏఎంసీ వందేళ్ల ఉత్సవాలు మిన్నంటాయి. భారత ఉప రాష్ట్రపతి జగదీప్ ధన్కర్ ప్రత్యేక విమానంలో శనివారం ఉదయం 11 గంటలకు ఎయిర్‌పోర్టుకు చేరుకున్నారు. గవర్నర్ అబ్దుల్ నజీర్, రాష్ట్ర ప్రభుత్వ ప్రతినిధి, ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్‌నాథ్, జిల్లా ఇన్‌చార్జి మంత్రి విడదల రజని, మేయర్ గొలగాని హరి వెంకట కుమారి, జిల్లా పరిషత్ చైర్‌పర్సన్ జి.సుభద్ర, కలెక్టర్ ఎ.మల్లికార్జున, పోలీస్ కమిషనర్ ఎ.రవిశంకర్, జీవీఎంసీ కమిషనర్ సాయికాంత్ వర్మ ఉపరాష్ట్రపతికి స్వాగతం పలికారు. అనంతరం ఐఎన్ఎస్ డేగా ప్రధాన కేంద్రానికి చేరుకున్న ఉపరాష్ట్రపతి తూర్పు నౌకాదళాధిపతి వైస్ అడ్మిరల్ రాజేష్ పెంధార్కర్ ఆధ్వర్యంలో నిర్వహించిన గార్డ్ ఆఫ్ హానర్‌ను స్వీకరించారు. అక్కడి నుంచి నేరుగా ఏఎంసీకి చేరుకున్న ఉపరాష్ట్రపతి ముందుగా మొక్కలు నాటారు. తర్వాత కళాశాల ఆవరణలో ఏర్పాటు చేసిన పైలాన్ ఆవిష్కరించారు. పైలాన్‌లోని చిత్రాల వివరాలను మంత్రి విడదల రజిని ఆయనకు వివరించారు. పూర్వ విద్యార్థుల విరాళాలు రూ.20 కోట్ల వ్యయంతో నిర్మించనున్న క్లినికల్ అండ్ బయో మెడికల్ రీసెర్చ్ సెంటర్ భవనానికి శంకుస్థాపన చేశారు. ఏఎంసీ చారిత్రక ఘట్టాలతో ఏర్పాటు చేసిన చిత్ర ప్రదర్శనను తిలకించారు. అనంతరం ఏర్పాటు చేసిన ఫొటోసెషన్‌లో పాల్గొన్నారు. అక్కడి నుంచి బీచ్‌రోడ్డు మార్గంలో ఏయూ కన్వెన్షన్ హాలుకు చేరుకున్నారు. మార్గంమధ్యలో బీచ్ అందాలను తిలకించిన ఆయన మంత్రముగ్ధులయ్యారు. కన్వెన్షన్ హాలులో ఏర్పాటు చేసిన శతాబ్ది వేడుకల్లో ముఖ్య అతిథిగా ఆయనతోపాటు గవర్నర్ అబ్దుల్ నజీర్, మంత్రులు గుడివాడ అమర్‌నాథ్, విడదల రజిని పాల్గొన్నారు.

విశాఖ అద్భుత నగరం

ఈ సందర్భంగా ఏఎంసీ ఖ్యాతిని ఉపరాష్ట్రపతి కొనియాడారు. విశాఖ అద్భుతమైన నగరమని ప్రశంసించారు. వేలాది మంది వైద్యులను అందించిన ఏఎంసీ మరింత ఉన్నత స్థితికి చేరుకోవాలని ఆకాంక్షించారు. వైద్య సేవల కోసం ప్రజలు ఆస్పత్రికి రాకుండా.. సంపూర్ణ వైద్యాన్నందించే కొత్త ఆవిష్కరణలకు నాంది పలకాలని పిలుపునిచ్చారు. తిరిగి ఐఎన్ఎస్ డేగాకు చేరుకున్న ఉపరాష్ట్రపతి అక్కడ కాసేపు విశ్రమించారు. అనంతరం ఢిల్లీకి ప్రత్యేక విమానంలో పయనమయ్యారు. కార్యక్రమాల్లో ఎంపీలు ఎంవీవీ సత్యనారాయణ, డా.బి.వి.సత్యవతి, జీవీఎల్ నరసింహారావు, సీఎం రమేష్, రాష్ట్ర వైద్యారోగ్య కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ జె.నివాస్, ఆర్డీవో హుస్సేన్ సాహెబ్, వీఎంఆర్‌డీఏ సెక్రటరీ కీర్తి, ఏఎంసీ ప్రిన్సిపాల్ డా.బుచ్చిరాజు, కేజీహెచ్ సూపరింటెండెంట్ డా.అశోక్ కుమార్, ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల కమిటీ అధ్యక్షుడు డా.రవిరాజ్ తదితరులు పాల్గొన్నారు. ఆంధ్ర వైద్య కళాశాలలో చదువుకుని దేశ, విదేశాల్లో స్థిరపడ్డ వైద్యులు, వైద్య విద్యార్థులు ఈ వందేళ్ల ఉత్సవాలకు తరలివచ్చారు. నగరంలోని పర్యాటక ప్రాంతాల్లో కలియ తిరుగుతూ సందడి చేశారు.

ఈఎన్‌సీ హెడ్‌క్వార్టర్స్‌ను సందర్శించిన ఉపరాష్ట్రపతి

ఏఎంసీ శతాబ్ది ఉత్సవాల అనంతరం ఐఎన్ఎస్ డేగాకు వెళ్లిన ఉపరాష్ట్రపతి అక్కడ నుంచి నేరుగా తూర్పు నౌకాదళ ప్రధాన కేంద్రానికి చేరుకున్నారు. ఈఎన్‌సీ చీఫ్ వైస్ అడ్మిరల్ పెంధార్కర్ ఆయనకు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఈఎన్‌సీ ప్రధాన కార్యాలయం ఆవరణలో ధన్కర్ మొక్కలు నాటారు. నౌకలో ప్రయాణిస్తూ.. ఈఎన్‌సీ శక్తి సామర్థ్యాలు, భద్రతా పరమైన అంశాలు తెలుసుకున్నారు. డాక్‌యార్డును సందర్శించిన ఉపరాష్ట్రపతి.. అక్కడ జరుగుతున్న కార్యకలాపాల గురించి ఆరా తీశారు.



మాట్లాడుతున్న ఉపరాష్ట్రపతి జగదీప్ ధన్కర్



మాట్లాడుతున్న రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్

మోదమ్మకు బంగారు ఆభరణాల సమర్పణ



మోదకొండమ్మ తల్లికి నగలు అలంకరిస్తున్న మాజీ ఎంపీ కొత్తపల్లి గీత, ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి



మోదమ్మకు మాజీ ఎంపీ గీత సమర్పించిన బంగారు నగలు

- విలువ రూ.26 లక్షలు
- అందజేసిన మాజీ ఎంపీ కొత్తపల్లి గీత దంపతులు

సాక్షి,పాడేరు: ఉత్తరాంధ్ర ప్రజల ఆరాధ్యదైవం పాడేరు మోదకొండమ్మతల్లికి అరకు మాజీ ఎంపీ, బీజేపీ నేత కొత్తపల్లి గీత దంపతులు రూ.26 లక్షల విలువైన బంగారు అభరణాలను సమర్పించారు. ఆమె కుటుంబ సమేతంగా శనివారం మోదకొండమ్మతల్లిని దర్శించుకున్నారు. ఆలయ కమిటీ చైర్‌పర్సన్, పాడేరు ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, మెడికల్ కౌన్సిల్ సభ్యుడు నర్సింగరావు, ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కొట్టగుల్లి సింహాచలంనాయుడు సమక్షంలో ఆభరణాలను అమ్మవారికి సమర్పించారు. ఆలయ పూజారులు ప్రభాకర్, సుబ్రహ్మణ్యం ప్రత్యేక పూజలు జరిపారు.

అనంతరం వాటిని మోదమ్మ విగ్రహం మెడలో గీత, భాగ్యలక్ష్మి అలంకరించారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో మాజీ ఎంపీ గీత దంపతులను సత్కరించారు. ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, నర్సింగరావు దంపతులు అమ్మవారి ఫొటో, ప్రసాదం అందజేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు పాంగి రాజారావు, కూడా కృష్ణారావు,పెనుమాక రవికుమార్, చల్లా రామకృష్ణ, ఆలయ కమిటీ ప్రతినిధులు కొట్టగుల్లి రామారావు,ఉప్పల వెంకటరత్నం పాల్గొన్నారు.

చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్ ఆవిష్కరణ

పాడేరు రూరల్ : వచ్చే నెల పది నుంచి జనవరి 28 వరకు రాష్ట్ర వ్యాప్తంగా చెకుముకి సైన్స్ సంబరాలను నిర్వహిస్తున్నట్లు ఐటీడీఏ పీవో అభిషేక్, జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు కె. త్రిమూర్తులు తెలిపారు. చెకుముకి సంబరాల పోస్టర్లను శనివారం స్థానిక ఐటీడీఏ కార్యాలయ ప్రాంగణంలో పీవో అభిషేక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చెకుముకి సంబరాల విజయవంతానికి ఎంఈవోలు, హెచ్‌ఎంలు, ఉపాధ్యాయులు కృషి చేయాలని కోరారు. జనవిజ్ఞాన వేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు త్రిమూర్తులు మాట్లాడుతూ వచ్చేనెల 10న పాఠశాల స్థాయి, నవంబర్ 30న మండల స్థాయి, డిసెంబర్ 17న జిల్లా స్థాయిలో వచ్చే ఏడాది జనవరి 27,28 తేదీల్లో రాష్ట్ర స్థాయిల్లో ఈ సంబరాలు నిర్వహిస్తామన్నారు. ఈపోటీల్లో పాల్గొనేందుకు 8, 9, 10 తరగతి విద్యార్థులు అర్హులన్నారు. ఈ కార్యక్రమంలో ఐటీడీఏ ఏపీవోలు వెంకటేశ్వరరావు, ప్రభాకర్, ఏవో హేమలత, గిరిజన సంక్షేమ శాఖ ఈఈ డీవీఆర్‌ఎం రాజు, జనవిజ్ఞాన వేదిక జిల్లా ప్రధాన కార్యదర్శి పారయ్య పాల్గొన్నారు.



పోస్టర్లను ఆవిష్కరిస్తున్న ఐటీడీఏ పీవో అభిషేక్

క్లుప్తంగా

బాధ్యతగా పనిచేయండి

వీఆర్‌పురం: ప్రజలకు ఎల్లప్పుడు అందుబాటులో ఉంటూ ప్రభుత్వ లక్ష్యాలకు అనుగుణంగా బాధ్యతగా పనిచేయాలని చింతూరు ఐటీడీఏ పీవో కావూరి చైతన్య అన్నారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో శనివారం మండల స్థాయి అధికారులు, కార్యదర్శులతో ఆయన సమీక్షించారు. అంతకుముందు పీవో పెదమట్టపల్లి వెలనెస్ సెంటర్‌ను పరిశీలించారు. అక్కడ అందుతున్న వైద్యసేవలపై ఆరా తీశారు. రేఖపల్లిలో గ్రామ సచివాలయ, రైతుభరోసా కేంద్రం,వెల్‌నెస్ సెంటర్ల భవనాలను పరిశీలించారు. ఇంజినీరింగ్ అధికారులకు పలు సూచనలు చేశారు. డిప్యూటీ డీఎంహెచ్‌వో పి.పుల్లయ్య, తహసీల్దార్ ఎస్.శ్రీధర్, ఎంపీడీవో ఫణీంద్ర పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలు పాటించకుంటే సీజ్

- 18 వాహనాలపై కేసు
- ఎస్పీ తుహిన్‌సిన్హా

పాడేరు రూరల్ : ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలను సీజ్ చేస్తామని ఎస్పీ తుహిన్ సిన్హా శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. జిల్లాలో ఎక్కువగా ఘాట్ రోడ్లు, మలుపులు ఉండటం, మంచు తీవ్రత, పర్యాటకుల తాకిడి నేపథ్యంలో తరచూ ప్రమాదాలు జరుగుతున్నాయని పేర్కొన్నారు. దీనిని దృష్టిలో పెట్టుకొని ఈనెల 27న జిల్లాలో పలుచోట్ల పోలీసు సిబ్బంది వాహన తనిఖీలు చేపట్టారన్నారు. నిబంధనలు పాటించని 18 ప్రైవేట్ వాహనాలపై కేసు నమోదు చేసి సీజ్ చేసినట్టు ఆయన పేర్కొన్నారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనాలపై ప్రత్యేక నిఘా ఉంచామని ఆయన తెలిపారు.

మురిసిన పర్యాటకం



మాడగడ సన్‌రైజ్ వ్యూ పాయింట్ వద్ద పర్యాటకులు



మంచు అందాలు

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయలో పర్యాటకులు సందడి నెలకొంది. వీకెండ్ కావడంతో భారీగా తరలివచ్చారు. అరకులోయకు పరిసరాల్లో పర్యాటక ప్రాంతాలను సందర్శించారు. మాడగడ సన్‌రైజ్ వ్యూపాయింట్, వలిసె తోటల్లో ఫొటోలు దిగారు.

చాపరాయిలో సందడి

డుంబ్రిగుడ: ప్రముఖ పర్యాటక కేంద్రం చాపరాయి జలపాదిన్ని తిలకించేందుకు శనివారం మైదాన ప్రాంతం నుంచి కుటుంబ సమేతంగా పర్యాటకులు తరలివచ్చారు. జలపాతంలో స్నానాలు చేస్తూ సందడి చేశారు. అరకు–పాడేరు ప్రధాన మార్గంలో రోడ్డుకు ఇరువైపులా ఉన్న వలిసె తోటల్లో ఫొటోలు దిగి ఉల్లాసంగా గడిపారు.



చాపరాయి జలపాతం వద్ద పర్యాటకులు

పంటల సాగుపై విద్యార్థులకు అవగాహన

చింతపల్లిరూరల్: స్థానిక పరిశోధన స్థానాన్ని ప్రకాశం జిల్లా కనిగి సీఎస్ పురం కదిరి బాబురావు కాలేజి ఆఫ్ అగ్రికల్చర్ ఏజీ బీఎస్సీ ద్వితీయ సంవత్సరం విద్యార్థులు విజ్ఞాన యాత్రలో భాగంగా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏడీఆర్ డాక్టర్ ఎం.సురేష్‌కుమార్ విద్యార్థులకు అగ్రిటూరిజం, పంటల సాగు విధానాలను వివరించారు. జిల్లాలో అరకు, పాడేరు, లంబసింగి, మారేడుమిల్లి ప్రాంతాల్లో జలపాతాలు, వాతావరణ పరిస్థితులు గురించి వివరించారు. విద్యార్థులకు ఈ విహార యాత్రతో పాటు విజ్ఞాన యాత్రగా కుడా ఉంటుందన్నారు. సీనియర్ శాస్త్రవేత్త సందీప్ నాయక్, ఆర్‌ఏ వంశీ కృష్ణ, కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ జగ్గారావు, డాక్టర్ భవనరాజ్ తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న ఏడీఆర్ సురేష్‌కుమార్

సంపూర్ణ ఆరోగ్యానికి వ్యాయామం తప్పనిసరి



4కె రన్‌లో పాల్గొన్న ఎస్‌ఐ శివకుమార్

మోతుగూడెం: సర్దార్ వల్లభాయ్ పటేల్ జయంతిని పురస్కరించుకొని దేశవ్యాప్తంగా ఫిట్ ఇండియా ఫ్రీడం రన్ నిర్వహిస్తున్నట్టు ఎఫ్–42 కంపెనీ ఇన్‌స్పెక్టర్ శశికుమార్ చెప్పారు. డొంకరాయి గ్రామంలో శనివారం నిర్వహించిన 4కె రన్ లో ఎస్‌ఐ శివ కుమార్‌తో పాటూ కానిస్టేబుల్ సుధాకర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎస్‌ఐ శివకుమార్ మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ క్రమం తప్పకుండా వ్యాయామం చేయడంతో ఆరోగ్యంగా ఉండవచ్చన్నారు.

అగ్నిప్రమాదంలో ఇల్లు దగ్ధం



దగ్ధమవుతున్న ఇల్లు

మారేడుమిల్లి : మండలంలోని పూజారి పాకలు గ్రామంలో శనివారం జరిగిన అగ్ని ప్రమాదంలో ఓ ఇల్లు దగ్ధమైయింది. గ్రామానికి చెందిన పూజారి భూమిరెడ్డి, లింగేశ్వరి దంపతులకు చెందిన రేకిల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. ఇంట్లో ఉన్న సుమారు టన్నున్నర రబ్బరు సీట్లు అగ్ని ప్రమాదంలో కాలిపోయాయని, ఇతర సామగ్రి దగ్ధమైందని కట్టుబట్టలతో వీధిన పడ్డామని బాధితులు తెలిపారు. అగ్ని ప్రమాదంలో రెండున్నర లక్షల రూపాయల ఆస్తి నష్టం జరిగిందని, అధికారులు తమను అదుకోవాలని బాధితులు వేడుకుంటున్నారు.

చంద్ర గ్రహణంతో ఆలయాలు మూసివేత

సాక్షి, పాడేరు: చంద్ర గ్రహణం కారణంగా జిల్లాలోని ప్రధాన ఆలయాలన్నీ శనివారం సాయంత్రం నుంచి ఆలయ పూజారులు మూసివేశారు. పాడేరు పట్టణానికి సంబంధించి మోదకొండమ్మ తల్లి, కనకదుర్గమ్మ తల్లి, ఉమా నీలకంటేశ్వర స్వామి తదితర ఆలయాలన్నింటినీ మూసివేశారు. ఆదివారం ఆలయాల శుద్ధి అనంతరం భక్తులకు దర్శనం కల్పిస్తారు.

గిరిజనుడికి పాముకాటు



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితుడు

చింతపల్లిరూరల్: లోతుగెడ్డ జంక్షన్ గ్రామానికి చెందిన వంతల నాగేశ్వరరావు(65) తన బంధువు గెమ్మెలి ప్రసాదరావు ఇంటికి జీకే వీధి మండల దామనపల్లికి శనివారం వెళ్లారు. ఈ నేపథ్యంలో ప్రసాద్ ఇంటి పరిసరాల్లో ఉన్న కూరగాయల తోటను పరిశీలించేందుకు వెళ్లిన నాగేశ్వరరావుకు పాము కాటేసింది. అతను ఎంతసేపైనా ఇంటికి తిరిగిరాకపోవడంతో తోటకు వెళ్లి చూడగా ఆయన అపస్మారక స్థితిలో ఉండడంతో హుటాహుటిన చింతపల్లి ఏరియా ఆస్పత్రికి తరలించారు. బాధితుడు నాగేశ్వరరావు పాము కాటుకు గురైనట్టు గుర్తించిన వైద్యాధికారి డాక్టర్ ప్రభావతి ప్రథమ చికిత్స అందించారు.

రక్తదాన, వైద్యశిబిరాలకు విశేష స్పందన

రంపచోడవరం: పోలీసు అమలవీరుల సంస్మరణ దినోత్సవం పురస్కరించుకుని రంపచోడవరం ఏరియా ఆస్పత్రి, పోలీసుల ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన రక్తదాన, వైద్య శిబిరాలకు విశేష స్పందన లభించింది.రంపచోడవరం సీఐ సురేష్‌బాబు, ఎస్‌ఐ మోహన్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు, స్థానికులు స్వచ్ఛందంగా రక్తదానం చేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ కె.లక్ష్మి మాట్లాడుతూ దాతల నుంచి సేకరించిన రక్తాన్ని ఆస్పత్రి బ్లడ్ బ్యాంక్‌లో నిల్వ చేస్తున్నామన్నారు. ఆస్పత్రిలో జరిగే సర్జరీల సమయంలో అత్యవసర పరిస్థితుల్లో అవసరమైన వారికి నిల్వ చేసిన రక్తాన్ని వినియోగిస్తామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఏవో ప్రియ, కౌన్సిలర్ వాసు, భూషణం, బ్లడ్ బ్యాంక్ సిబ్బంది కుమార్, అరుణ, పండు తదితరులు పాల్గొన్నారు.



రక్తదాన శిబిరంలో పాల్గొన్న పోలీసులు, ఆస్పత్రి సూపరింటెండెంట్

డిజిటల్ లావాదేవీలపై అవగాహన

జి.మాడుగుల: మండలంలోని వంజరి పంచాయతీ పినకిల్తారి గ్రామంలో జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ఆధ్వర్యంలో రైతులకు డిజిటల్ లావాదేవిలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో పాల్గొన్న పీఏసీఎస్ పర్సన్ ఇన్‌చార్జి ఎస్.మత్స్యకొండనాయుడు జిల్లా కేంద్ర సహకార బ్యాంక్ ద్వారా రైతులకు అందిస్తున్న రుణాలు ఇతర లావాదేవీలు, డిజిటల్ లావాదేవీలపై అవగాహన కలిగి ఉండాలన్నారు. ఈ సందర్భంగా డిజిటల్ లావాదేవీలు అమలుతీరు, ప్రాధాన్యం, ఆవశ్యకతను రైతులకు వివరించారు. పీఏసీఎస్ చైర్మన్ నూర్మనీ.మత్సకొండనాయుడు కో–ఆపరేటివ్ బ్యాంకు డైరెక్టర్ వంజరి సన్యాసినాయుడు, పాడేరు డీసీసీబీ మేనేజర్ శ్రీనివాసరావు, సీఈవో లింగమూర్తి తదితరులు పాల్గున్నారు.



పినకిల్తారి గ్రామంలో రైతులకు అవగాహన కల్పిస్తున్న డీసీసీబీ సిబ్బంది

సస్యరక్షణతో మంచి దిగుబడి

డుంబ్రిగుడ: మండలంలోని కొర్రాయి పంచాయతీ కర్రబల్లి గ్రామంలో రైతు సాధికార సంజీవిని, వ్యవసాయ శాఖ, వాసన్ సంస్థల ఆధ్వర్యంలో పంటల సాగుపై శనివారం రైతులకు అవగాహన సదస్సు నిర్వహించారు. కర్రబల్లి గ్రామంలో కిల్లో ప్రతాప్ పొల్లంలో గులిసామ, గులి రాగిపై గిరిజన రైతులకు అవగాహన కల్పించారు.

ఆర్ఏఆర్ఎస్ చింతపల్లి ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో పలువురు శాస్త్రవేత్తలు, అధికారులు మాట్లాడుతూ సస్యరక్షణ పద్ధతులు పాటిస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. గులి రాగి పంటల ఎకరాలో విస్తీర్ణంలో సాగుబడి చేస్తే 6.64 క్వింటాల దిగుబడి వస్తుందన్నారు. ఈ పద్ధతుల్లోనే సాగుబడి చేయాలని రైతులకు అవగాహన కల్పించారు. సంజీవిని సంస్థ డైరెక్టర్ దేవుళ్లు, వ్యవసాయ శాఖాధికారి నీలవేణి, శాస్త్రవేత్తలు డాక్టర్ ఉజ్వలరాణి, జగన్నాథం, డీపీఎం భాస్కర్‌రావు, వ్యవసాయ శాఖ అసిస్టెంట్లు, గిరిజన రైతులు పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు

గమనిక

సాక్షి తెలుగు దినపత్రికలో రోజూ ప్రచురించే క్లాసిఫైడ్ ప్రకటనలు చదివి, వాటిని నిశితంగా పరిశీలించిన పిదప ప్రతిస్పందించాల్సిందిగా మా పాఠకులను కోరడమైనది. ప్రకటనదారు తెలిపే లేదా క్లెయిమ్ చేసే వాటితో ఈ వార్తా పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.